

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

11 ఆగస్టు 2025 పేజీలు : 08 సోమవారం


## ట్రాక్టర్ ర్యాలీని విజయవంతం చేయండి

### ఎమ్మెల్యే కాకర్ల సురేష్



*వింజమూరు, మేజర్‌న్యూస్ :*

రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని అమలు పరచి అన్నదాతలు సుఖవంతంగా ఉండేందుకు ప్రతిష్టంగా అమలు చేసిన సందర్భంగా ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపే కార్యక్రమంలో భాగంగా 13వ తేదీ బుధవారం ఉదయం 9 గంటలకు దుత్తలూరు మండలం నుండి ట్రాక్టర్ ర్యాలీని నిర్వహిస్తారని, ఆ ర్యాలీ విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పిలుపునిచ్చారు. దుత్తలూరు తహసిల్దార్ కార్యాలయం నుండి ఉదయగిరి ఏఎంసి కార్యాలయం వరకు ట్రాక్టర్లతో ర్యాలీ జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ ర్యాలీకి తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, రైతన్నలు, ట్రాక్టర్ యజమానులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

- చిరువ్యాపారులకు తోపుడు బండ్లు పంపిణీ చేసిన మంత్రి
- గత ఎన్నికల ప్రచారంలో వీధి వ్యాపారుల జీవన శైలి కళ్లారా చూశాను
- అద్దె చెల్లించే అవసరం లేకుండా వారికి సొంత నిధులతో బండ్లు ఇచ్చాను
- ఇచ్చిన ప్రతి హామీలను ఒక్కోటిగా నెరవేరుస్తానని మంత్రి హామీ
- మంచి చేస్తుంటే కొందరు విమర్శలు చేయడం దారుణం
- ఎవరెన్ని చేసినా.. నా సంకల్పం ఆగదు : మంత్రి నారాయణ వెల్లడి




## నెల్లూరు సిటీని మోడల్‌గా తీర్చిదిద్దుతా

*నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :*

నిరుపేదరికాన్ని నుండి వచ్చాను కాబట్టే.. పేదల కష్టాలు తెలుసని.. అందుకే తన సొంత నిధుల నుండి నిరుపేదలకు సహాయం అందిస్తున్నానని రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరు సిటీని మోడల్ సిటీగా తీర్చి దిద్దుతానని, ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తామని ఆయన పేర్కొన్నారు. గోమతి నగర్ క్యాంపు కార్యాలయంలో తోపుడు బండ్ల పంపిణీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ.. చాలా మంది చిరు వ్యాపారులు సంపాదన లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వారికి అండగా నిలిచేందుకు -మిగతా 2లో

- వీపీఆర్ దాతృత్వంతో.. కొండబిట్రగుంటకు కొత్త శోభ
- అంగరంగ వైభవంగా వీపీఆర్ దంపతుల చేతుల మీదుగా కోనేరుకు శంకుస్థాపన
- భక్తుల కలను సాకారం చేస్తున్న వేమిరెడ్డి దంపతులు
- కోనేరు నిర్మాణం పూర్తికి రూ.2.10 కోట్ల విరాళం
- వచ్చే ఏడాది బ్రహ్మోత్సవాలకు పూర్తి చేయాలని నిర్ణయం
- వేంకటేశ్వరస్వామికి సేవ చేయడం మా పూర్వజన్మ సుకృతం
- రూ.1.65 కోట్లతో మహా ప్రాకార నిర్మాణానికి శంకుస్థాపన

## శోభాయమానం.. బిలకూటక్షేత్రం



*బోగోలు, మేజర్‌న్యూస్ :*

ఆధ్యాత్మికతకు సరికొత్త రూపం ఇస్తూ.. దాతృత్వంలో ఉన్నత శిఖరాన ఉన్న వేమిరెడ్డి దంపతులు మరో గొప్ప కార్యానికి శ్రీకారం చుట్టారు. కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామివారు వెలిసిన కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి కోనేరు పునరుద్ధరణకు తమవంతుగా రూ. 2.10 కోట్ల విరాళం అందిస్తు న్నారు. ఈ నేపథ్యంలో ఆధ్యాత్మికానందాల నడుమ కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డితో కలిసి ఆదివారం కోనేరు శంకుస్థాపన కార్యక్రమంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు మెంబర్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు పాల్గొని శంకుస్థాపన చేశారు. అలాగే దేవాదాయ నిధులు రూ. 1.65 కోట్లతో ఆయన మహా ప్రాకారానికి కూడా శంకుస్థాపన పూర్తి చేశారు. ముందుగా ఆలయానికి చేరుకున్న వేమిరెడ్డి దంపతులకు ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి, ఆలయ అర్చకులు, స్థానిక ప్రజలు పార్టీ నాయకులు, కార్యకర్తలు అపూర్వ స్వాగతం పలికారు. అనంతరం స్వామి, అమ్మవారిని దర్శించుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల వేదాశీర్వాదం అందుకున్నారు. పూజల అనంతరం స్వామివారి వేంచేపుగా కోనేరు ప్రాంగణానికి రాగా.. వేమిరెడ్డి దంపతులు ఎమ్మెల్సీ బీద రవిచంద్ర సతీమణి జ్యోతితో -మిగతా 2లో







## మర్రిపాడు ప్రజల్లో.. భయం..భయం !





**జిల్లా సరిహద్దు ప్రాంతమైన మర్రిపాడు మండల ప్రజలు నిత్యం భయాందోళన మధ్య గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఓ పక్క నెల్లూరు - ముంబై జాతీయ రహదారిపై వరుస ప్రమాదాలతో ప్రాణాలు కోల్పోతున్నారు. మరోపక్క వ్యవసాయ పొలాల్లో ఉన్నటువంటి ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు జోరుగా సాగుతున్నాయి. దీంతో రైతులకు చోరీలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఫలితంగా పోలీసులకు దిమ్మతిరిగే సవాల్‌గా మారింది. అరికట్టాల్సిన ఉన్నతాధికారులు తగు చర్యలు చేపట్టకపోవడంతో మండల ప్రజల భయంకు అంతులేకుండా పోతోంది.**

**వివరాల్లోకి వెళ్తే..**

**ఓ పక్క వరుస ప్రమాదాలు - మరోపక్క కునుకు లేకుండా చేస్తున్న చోరీలు**

**పోలీసులకు దిమ్మ తిరిగే సవాల్ - అరికట్టడంలో ఉన్నతాధికారులు విఫలం**


మర్రిపాడు, ...జర్‌న్యూస్ : జిల్లాలోని మర్రిపాడు మండల ప్రజలు రోజురోజుకీ భయాందోళన మధ్య కాలం గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. మండల పరిధిలోని నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై ప్రయాణించాలంటేనే వాహనదారులు ప్రయాణికులు హడలెత్తిపోతున్నారు. వరుస రోడ్డు ప్రమాదాలతో ప్రాణాలు కోల్పోతుండడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఈ జాతీయ రహదారిపై ఎక్కువగా లారీలు, కార్లు ప్రయాణిస్తుండడంతో ద్విచక్ర వాహనదారులకే ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ ప్రమాదాల్లో కొంత మంది ప్రాణాలు కోల్పోతుండగా మరి కొంత మందికి కాళ్లు చేతులు విరిగిపోతుండగా తలభాగాల్లో గాయాలు అవుతూ నివాసాలకే పరిమితం అవుతున్నారు. దీంతో ఆ కుటుంబాల యజమానులు మంచానికే పరిమితం అవుతుండడంతో పూటగడవక వీధిన పడుతున్న సందర్భాలు ఏర్పడుతున్నాయి. లారీలు, కార్లు అమిత వేగంతో వెలుతునడంతోనే ఈ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని మండల ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అరికట్టాల్సిన అధికారులు చేతులెత్తేస్తుండడంతో ఈ పరిస్థితి దాపురించిందని వాపోతున్నారు. ఈ విధంగా జాతీయ రహదారి వరుస ప్రమాదాలతో నెత్తురోడుతోంది. ఫలితంగా వాహనదారులు ఆ జాతీయ రహదారిపై ప్రయాణించాలంటేనే హడలెత్తిపోతున్నారు. అందువలన అమితవేగంతో పోతున్న వాహనాలను సంబంధిత అధికారులు అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

**ఇకపోతే చోరీలు..**

మర్రిపాడు మండలంలోని పలు గ్రామాల్లో వరుస చోరీలు జరుగుతున్నాయి. ప్రధానంగా వ్యవసాయ పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లతో పాటుగా స్టార్టర్లు చోరీలకు గురవుతున్నాయి. వాటిలో ఉండేటటువంటి రాగి, ఆయిల్‌ను గుర్తు తెలియని దుండగులు దొంగిలించుకుపోతున్నారు. దీంతో ఆ రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది. ప్రధానంగా మర్రిపాడు మండలంలో ఉన్న వ్యవసాయ పొలాల్లో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు దుండగులకు జేబులు నింపుతున్నాయి. ఫలితంగా రైతులు వేలాది రూపాయలు నష్టపోక తప్పడం లేదు. మర్రిపాడు గ్రామంతోపాటు సన్నువారిపల్లి, కృష్ణాపురం, చుంచులూరు, పడమటినాయుడుపల్లి తదితర గ్రామాల్లో ఈ చోరీలు ఎక్కువగా జరిగాయని రైతులు వాపోతున్నారు. ఈ విధంగా మండలంలో దొంగలు హల్చల్ సాగిస్తున్నారు. పోలీసులు ఎక్కువ సమయం గస్తీలపై శ్రద్ధ చూపాల్సిందిగా రైతులు, మండల ప్రజలు కూడా కోరుతున్నారు.







## శోభాయమానం.. బిలకూటక్షేత్రం





*(మొదటి పేజీ తరువాయి)*

కలసి ఆలయ మహా ప్రాకారానికి భూమిపూజ నిర్వహించి శంకుస్థాపన నిర్వహించారు. అనంతరం వీపీఆర్ దంపతుల దాతృత్వంలో నిర్మించనున్న కోనేరుకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. కొండబిట్రగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వారి ఆశీసులతో కోనేరు పునఃనిర్మాణానికి పూనుకోవడం పూర్వజన్మ సుకృతమన్నారు. దాదాపు రూ.2.10 కోట్లతో పుష్కరిణి నిర్మాణాన్ని చేపడుతున్నట్లు వివరించారు. స్వామివారు తమకు ఇచ్చిన దాంట్లోనే ఇదంతా చేస్తున్నామన్నారు. స్వామివారి పుష్కరిణి బాధ్యత మాకు దక్కడం అదృష్టమన్నారు. 800 ఏళ్ల చరిత్ర ఉన్న స్వామివారి ఆలయం మరింత అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు. కోనేరు అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. స్వామివారి ఆశీసులతో రాష్ట్రం, జిల్లా ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని, జిల్లా సమగ్రాభివృద్ధి సాధించాలని కోరారు. వచ్చే ఏడాది బ్రహ్మోత్సవాలకు పూర్తి చేయాలని నిర్ణయించినట్లు వివరించారు.

ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ.. ప్రసన్న వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవాలని పలుమార్లు అనుకున్నానని, కానీ కుదరలేదన్నారు. ఇప్పుడు కోనేరు శంకుస్థాపన సందర్భంగా స్వామివారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. శంఖు చక్రాలు తిరగేసి ఉండటం స్వామివారి ప్రత్యేకత అని చెప్పారు. ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి రూ.15 కోట్ల నిధులు సాధించడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. అలాగే టిటిడి తరపున వేద పాఠశాల ఏర్పాటుపై చర్చిస్తామని ఎమ్మెల్యే విజ్ఞప్తికి స్పందించారు.

కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. అడిగిన వెంటనే కాదనకుండా కోనేరు నిర్మాణానికి అంగీకరించిన వేమిరెడ్డి దంపతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. దాతలు, ప్రభుత్వ సహకారంతో దాదాపు 15 కోట్ల నిధులతో ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. పాత కాలంలో బ్రిటిషర్లు స్వామివారి శక్తిని తగ్గించేందుకు తూర్పు దిశగా కాకుండా ఉత్తర దిశగా మెట్ల మార్గాన్ని ఏర్పాటు చేశారని చెప్పారు. అందుకే ఆ తప్పులను సరిదిద్దేందుకు ఇప్పుడు తూర్పు దిశగా మెట్లు, ప్రధాన ద్వారాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఎంతోమంది దాతల సహకారంతో స్వామివారి ఆలయాన్ని సంపూర్ణంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ సందర్భంగా టీటీడీ ఆధ్వర్యంలో ఇక్కడ వేద పాఠశాల ఏర్పాటు చేయాలని టీటీడీ బోర్డు మెంబర్ ప్రశాంతిరెడ్డికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కావలి ఏఎంసీ చైర్పర్సన్ పోతుగంటి అలేఖ్య, ఆలయ ఈవో, ఇతర అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు సిటీని మోడల్‌గా తీర్చిదిద్దుతా



*(మొదటి పేజీ తరువాయి)*

తనవంతు సాయంగా తోపుడు బండ్లు అందజేస్తున్నట్లు వెల్లడించారు. ఒక్కరోజే 47 మంది నిరుపేదలకు తోపుడు బండ్లు అందజేశామన్నారు. అందులో 41 తోపుడు బండ్లు, ఐదు ఇస్త్రీ బండ్లు, ఒకరికి రిక్షా అందించినట్లు తెలిపారు. అదేవిధంగా తాను తాటాక గుడిసెలో పుట్టానని, కడు పేదరికాన్ని అనుభవించాను కాబట్టే.. ఈ స్థాయికి వచ్చానన్నారు. పేదల కష్టాలు తెలుసుకున్నాను కాబట్టే, నా వంతు సహాయం అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఎన్నికల ప్రచారంలో విధి వ్యాపార జీవనం శైలి చూశానని.. అద్దెకు బండి తీసుకొని వ్యాపారాలు చేసుకొని ఇబ్బందులు పడ్డారని, అందుకే అద్దె చెల్లించే అవసరం లేకుండా తోపుడు బండ్లు అందజేశామన్నారు. నిరుపేద పిల్లల కోసం వీఆర్‌ని అంతర్జాతీయ ప్రమాణాలతో సిద్ధం చేశామని, దానిపైన కూడా కొందరు విమర్శలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరు ఎన్ని చేసినా.. నా సంకల్పం ఆగదని మంత్రి ఘంటాపథంగా తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరానికి 12 హైస్కూల్‌లను వీఆర్‌సి తరహాలో సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. సీఎం మానసపుత్రిక అయిన పీ4 కింద పేదలకు చేయూత ఇవ్వాలని నా పిల్లలు కూడా సంకల్పించారన్నారు. మాది పేదల ప్రభుత్వం అని.. భగత్ సింగ్ కాలనీవాసుల శాశ్వత పట్టాలు పంపిణీ ఒక నిదర్శనమని మంత్రి నారాయణ తెలిపారు. దశాబ్దల కల నెరవేరడంతో వారి ఆనందానికి అవధులు లేవన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, టీడీపీ సీనియర్ నేత వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ తాళ్ళపాక అనురాధ, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు ధర్మవరం సుబ్బారావు, క్లస్టర్ ఇన్చార్జులు, డివిజన్ ప్రెసిడెంట్లు, టీడీపీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# మంత్రి ఆనం సారధ్యంలో ఆత్మకూరు సర్వతోముఖాభివృద్ధి



- 400కోట్ల నిధులతో అభివృద్ధి
- తాజాగా విద్యాలయాలకు రూ.1,06కోట్లు
- దేవాలయాలకు రూ.6కోట్లు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర ఆర్థికశాకామంత్రిగా ఉంటూ ఆత్మకూరు నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ప్రతినిధ్యం వహించిన ఆనం రామనారాయణరెడ్డి నాడు దాదాపు 2500కోట్లు నిధులు సాధించి ప్రగతిని పరుగులు తీయించడంతోపాటు రెవిన్యూడివిజన్, ఆత్మకూరు మున్సిపాలిటీ, ప్రాంతీయవైద్యశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్, పలు ఐటిఐలు, కస్తూర్భా, ఆదర్శ పాఠశాలలు, అతిపెద్ద వంతెనలు, భవనాలు తదితరాలు సాధించి ఆత్మకూరు అభివృద్ధి ప్రదాతగా పేరుగాంచిన పరిస్థితి కాగా ఈదపా ఆయన ఆత్మకూరు శాసనసభ్యులుగా ఎన్నికై రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రిగా ఉండగా ఈ నియోజకవర్గానికి మహర్ధశ తథ్యమన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఆయన అనుభవం, అవసరాలు, సమస్యలపట్ల అవగాహన, పరిష్కారానికి అవసరమైన పరిజ్ఞనం అందరికీ తెల్సిందేకాగా అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తుండగా ఇప్పటికే ఆత్మకూరు నియోజకవర్గానికి దాదాపు 400కోట్లు సాధించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. తాజాగా 8 విద్యాలయాల అభివృద్ధికి రూ.1.06కోట్లు, దాదాపు 120 దేవాలయాలకు రూ.6కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేయించారు. ఆయన అధికారంచేపట్టిన ఈ ఏడాదోలోగానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును రెండుదపాలు ఆత్మకూరుకు రప్పించి అనేక అభివృద్ధిపనులకు శ్రీకారం చుట్టారు. అనేక హామీలు పొందారు, అవన్నీ త్వరలో కార్యరూపం దాల్చనున్నాయని రామనారాయణరెడ్డి ఇటీవల పేర్కొన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో ఈ ఏడాదిలో 74 సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరుగగా ఆనం సారధ్యంలో ప్రజాదరణతో అన్నింటిని ఏకగ్రీవంగా తెలుగుదేశం కైవసం చేసుకుంది, 220మంది కుటుంబాలకు సిఎం సహాయనిధులు 2.78కోట్లు మంజూరు చేయించామని, పంచాయతీల్లో 378 పనులు 23.9కోట్ల రూపాయలతో ప్రారంభించామని, సిసిరోడ్లనిర్మాణాలకు కేంద్రనిధులుతో 53,348 సిమెంటురోడ్లు మంజూరు చేయించగా పనులు జరుగుతున్నాయని, 6.37కోట్ల రూపాయలతో బైపాస్‌రోడ్డు ఆధునీకరించనున్నామని, 2.66కోట్లతో హాస్టల్స్‌భవనాలకు మరమ్మత్తులు చేయిస్తున్నామని, ఇటీవల సీఎం చేతులమీదుగా నారంపేటవద్ద 37కోట్ల రూపాయలతో పనులు పూర్తిచేసిన పారిశ్రామికపార్కును ప్రారంభించామని, పరిశ్రమలు తేనున్నమని, నిరుద్యోగయువతకు ఉద్యోగ, ఉపాధిఅవకాశాలు కల్పించనున్నామని, బిసి గురుకుల పాఠశాలను మంజూరుచేయించి నలుగురు మంత్రులను రప్పించి ప్రారంభించామని, ఈ పాఠశాలను బాలికల జూనియరన్‌కాలేజిగా మంజూరకు సీఎం హామీ పొందామని, 3కోట్లతో భవనాలు నిర్మించనున్నామని, పదేళ్ళ క్రితం తాను మంజూరుచేయించిన ఆర్‌అండ్‌బి అతిథిగృహం ఎక్కడవేసిన గొంగళి అక్కడే ఉండగా 1.8లక్షల రూపాయలతో పనులుపూర్తిచేసి ప్రారంబించామని, విరువూరు-కలువాయి రోడ్డుకు 6కోట్లు మంజూరుచేయించామని, వీర్లగుడిపాడు, నాగులపాడు, నారంపేట రోడ్లకు 9కోట్లు మంజూరు చేయించామని, వీర్లగుడిపాడు నుండి 15కోట్లతో వంతెన,రోడ్డు వేసి మండల కేంద్రమైన సంగంకు చేరువచేస్తున్నామని, రామస్వామిపల్లి-నల్లగొండ్ల రోడ్డుకు 6కోట్లు మంజూరయ్యాయని, 1.5కోట్లు పంచాయతీరాజ్ అతిథిగృహానికి మంజూరు చేయించామని, ఐదు విద్యుత్ సబ్‌స్టేషన్లకు, చేజర్ల, అనంతసాగరం మండలాల్లో అగ్నిమాపకకేంద్రాలు మంజూరు చేయించేలా హామీ తీసుకున్నామని, నాడు 100పడకల హాస్పిటల్‌గా తాను మంజూరుచేయించగా గత పదేళ్ళలో ఎలాంటి అభివృద్ధి లేనందున ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళి ప్రస్థుతానికి 150పడకలుగా, భవిష్యత్తుతో 300పడకలుగా వృద్ధిచేయనున్నామని, అదనపు భవనాలకు 16కోట్లు మంజూరుచేయించానని, సోమశిలలో 30పడకల హాస్పిటల్ సాధించనున్నామని, గ్రామాల్లో దాహార్తికి 83.34కోట్లు మంజూరు చేయించానని, ఇంటింటికీ కొళాయి పథకం జలజీవన్‌మిషన్ కేంద్రప్రభుత్వ నిధులు 870కోట్లతో మంజూరు చేయించామని, సోమశిల ప్రాజెక్టు గేట్లు, రోప్ మరమ్మత్తులకు 117కోట్లు మంజూరు చేయించానని, నాడు 1600కోట్లతో ఆనం సంజీవరెడ్డి హైలెవల్‌కెనాల్ సాధించుకోగా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్ళి పనులు ప్రారంభమయ్యేలా చేశానని, వెలుగుగొండ ప్రాజెక్టు పనులు పూర్తిచేయించి ఉదయగిరి, వరికుంటపాడు, దుత్తలూరు, సీతారామపురం, మర్రిపాడు మండలాలకు సాగునీరందించేలా కృషిచేస్తున్నామని, 86వేల ఎకరాలకు సాగునీరందగలవని ఆయన వెల్లడించారు. ఆత్మకూరు మున్సిపాలిటీలో రోడ్లు, డ్రైన్‌లు తదితరాలకు 43కోట్లు మంజూరుచేయించి సమగ్రాభివృద్ధికి, రింగ్‌రోడ్ల నిర్మాణాలకు 100కోట్లతో ప్రతిపాదించానని రామనారాయణరెడ్డి పేర్కొన్న విషయం విధితమే. ఏడాదిలోపే ఇంతటి అభివృద్ధి సాధ్యంకాగా మిగతా నాలుగేళ్ళలో ఆయన మదిలో ఉన్న బోలెడు అభివృద్ధి ఆలోచనలు కార్యరూపందాల్చి ఆత్మకూరుకు మహర్ధశ తధ్యమని సర్వత్రా అభిప్రాయపడుతున్నారు.

## నిబంధనలు సడలించాలి..

# అర్హులందరికీ న్యాయం చేయాలి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** వివిద సమస్యలు, సంక్షేమకార్యక్రమాల్లో అర్హులందరికీ న్యాయం చేయాలని, గతప్రభుత్వంలోఉన్న నిబంధనలను సడలించాలని వివిద వర్గాల ప్రజలు కోరుతున్నారు. గత ప్రభుత్వ నిర్ణయాలు అమలు చేస్తే ఇబ్బందికరమని కొందరు, కొన్ని నిర్ణయాలు అమలుచేయకుంటే ఇబ్బందికరమని మరికొందరు అభిప్రాయపడ్డారు. 20సంవత్సరాలకు క్రితం ప్రభుత్వం డిఫారం పట్టాగా రైతులకు ఇచ్చిఉంటే అలాంటివారికి ఫ్రీహోల్డ్ అంటూ వైసిపి ప్రభుత్వం పలువురు రైతులకు ఫ్రీహోల్డ్ అంటూ సర్టిఫికేట్లు పంపిణీ చేశారు. ఈ సర్టిఫికేట్ ద్వారా ఆ భూములను విక్రయించుకోవచ్చని, రిజిస్టర్ చేసుకోవచ్చని నిర్ణయించారు. దాదాపు ఏడాదిక్రితం ఈ సర్టిఫికేట్లు ఇవ్వడంతోపాటు ఆన్‌లైన్‌లో ఆయా పొలాలకు సంబంధించి గత ఏడాది ఫ్రీహోల్డ్ చేయబడిందని నమోదు చేశారు. కానీ తీరా చూస్తే టీడీపీ ప్రభుత్వం ఫ్రోహోల్డ్ అంశాన్ని పెండింగ్‌లో ఉంచింది. దాంతో ఆ సర్టిఫికేట్లు పొందిన రైతులు తీవ్ర నిరాశకుగురై ఆవేదన చెందుతున్నారు. తమకు 20సంవత్సరాలకు ముందు ఇచ్చిన డిఫారం పట్టాలు శాశ్వతపట్టాలుగా మారనున్నాయని సంబరపడ్డ రైతులు దిగాలు చెందిన ఉన్నారు. ప్రభుత్వం ఈవిషయమై పరిశీలించిన కొత్తగా ఇవ్వకున్నా ఇప్పటివరకు ఇచ్చిన ఫ్రీహోల్డ్ అంటూ సర్టిఫికేట్లు ఇచ్చివారికి చెల్లుబాటు అయ్యేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకొని న్యాయం చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.

### ఫించన్లకు గత ప్రభుత్వ నియమాలు పాటించవద్దు

వివిద రకాల పెన్షన్ల కొనసాగింపు, మంజూరుకు గత వైసిపి ప్రభుత్వ నియమాలు అమలుచేయవద్దని, చాలామంది తీవ్రంగా నష్టపోతారని అనేకమంది పెన్షనర్లు, పెన్షన్‌కు అర్హులైనవారు కోరుతున్నారు. గత ప్రభుత్వం దారిద్ర్యరేఖకు దిగువనున్న రైస్‌కార్డుదారు లందరూ అర్హులు కాగా విద్యుత్ వినియోగం నెలకు 300యూనిట్లుకన్నా అధికంగా ఉందని, ఇంటికొలతలు అధికంగా ఉన్నాయని, నాలుగుచక్రాల వాహనాలున్నాయని, కుటుంబసభ్యులు ఆదాయపన్నులు చెల్లిస్తున్నారంటూ అనేకమందిని అనర్హులుగా చేసి పెన్షన్‌లు రద్దుచేశారు. అర్హులు నూతనంగా దరఖాస్తులు చేసుకునే అవకాశం లేకుండా చేశారు. దాంతో అందరూ లబోదిబో అంటూ తీవ్ర ఆవేదనకు గురికాగా పెన్షన్లను రద్దుచేసి పలువురికి వైసిపి ప్రభుత్వం అన్యాయం చేస్తుందంటూ తెలుగుదేశం నాయకులు గగ్గోలు పెట్టారు. కాగా రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన తెలుగుదేశం ప్రభుత్వం అదే నియమాలను అమలు చేయనుందని, అనర్హులంటూ పలువరి పెన్షన్లకు ముప్పురానుందని, కొత్తగా పెన్షన్ల మంజూరుకు గత నిర్ణయాలు, నియమాలు పాటించనున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. గత నిర్ణయాలు అమలు ఉంటుందా లేదా, తాజా నిర్ణయాలా అనేది ప్రభుత్వం నుండి సచివాలయాకు ఇంకా ఎలాంటి ఆదేశాలు అందలేదంటున్నారు. ఏదేమైనా అర్హులకు నియమావళి అంటూ రైస్‌కార్డుదారులకు నూతన పెన్షన్లు మంజూరుకాకున్నా, ప్రస్తుతం ఉన్న పెన్షన్లు రద్దయినా అనేకమంది నష్టపోయేపరిస్థితి, ఆందోళనకుగురయ్యే పరిస్థితి, అలజడి చెలరేగే పరిస్థితి ఉంటుందని, ప్రభుత్వం పునరాలాలోచించి గతంలో తెలుగుదేశం అమలుచేసిన నియమావళినే ప్రాతిపదికన తీసుకోవాలని, వైసిపి నియమాలు అమలుచేయరాదని, సాధారణ,మధ్యతరగతి కుటుంబాలవారు కూడా విద్యుత్ 300యూనిట్లకన్నా అధికారంగా వినియోగించుకునే పరిస్థితి ఉంటుందని, బిడ్డలు చదువుకుంటూ కనీస అవసరాలను వాడుకూటుంటారని, అలాంటివారిని గమనించాలని, ఆంక్షలపేరుతో పెన్షన్లు రద్దుచేయారాదని అనేకమంది కోరుతున్నారు.

### టిడ్కోగృహాలు మంజూరైనవారికి పట్టాలివ్వాలి

గతంలో తెలుగుదేశం ప్రభుత్వహయాంలో నిర్మించిన టిడ్కోగృహాల నిర్మాణాలను పూర్తిచేసి లాటరీ విధానంలో లబ్దిదారులకు కేటాయించారు. గత వైసిపి ప్రభుత్వం వాటిని గురించి పట్టించుకొనకుండా ఎన్నికలు సమీపించే పరిస్థితిలో మళ్ళీ గృహాలను కేటాయించారు. అయితే ఆత్మకూరులో చూస్తుంటే 1050 గృహాలు కాగా ఇప్పటివరకు ఐదారువందలమంది అక్కడకు నివాసాలు మార్చుకున్నారు. గతంలో చెప్పిన విధంగా అక్కడ గుడి, చర్చి, మశీదు, పార్కు, స్కూలు, అంగన్‌వాడీ కేంద్రం తదితరాలను ఏర్పాటు చేస్తామని తెలుగుదేశం ప్రభుత్వం ప్రకటించారు. పార్కుకు సంబంధించి మెటీరియల్ కూడా అక్కడకు చేర్చారు. అనంతరం వచ్చిన వైసిపి ప్రభుత్వం వాటి గురించి ఆలోచించిన పాపానపోలేదు. కాగా కొన్ని గృహాలు ఖాళీలుండగా అర్హులు కొందరు దరఖాస్తు చేసుకున్నారు. విఆర్వో, కమీషనర్, ఆర్డీవోల అర్హులుగా ఆమోదించి ఫైనల్‌గా జాయింట్ కలెక్టర్‌కు ప్రాతిపాదించగా అక్కడ కూడా ఆమోదం పొంది గృహాలు మంజూరయ్యాయి. అయితే వారికి పట్టాలిచ్చే సమయానికి రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. పట్టాపుస్తకాలపై గత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఫోటోలున్నాయని అధికారులు నిలిపివేశారు. ఈ ప్రభుత్వం ఆపాస్‌బుక్‌లను మార్చి లబ్దిదారులకు పట్టాలివ్వాలని కోరుతున్నారు. ఈవిషయమై ప్రభుత్వం సత్వర నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు.

## వేలాదిమంది ప్రజలదాహార్తిని తీరుస్తున్న కంచి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలో, నెల్లూరు-ముంబాయి జాతీయరహదారిపై నెల్లూరుపాళెం కూడలి వద్ద స్థానిక నిత్యాన్నదాత, అనేక సామాజికసేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్న శ్రీ సాంబశివ చారిటబుల్‌ట్రస్ట్ చైర్మెన్ కంచి పరమేశ్వరరెడ్డి దాహార్తితో అల్లాడుతున్న ప్రజల దాహార్తిని తీరుస్తున్నారు. అనేక సామాజికసేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న, స్తానిక జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో రోజుకు దాదాపు 700 మందికి అన్నదానం అందిస్తూ నిత్యాన్నదాన కార్యక్రమం నిర్విఘ్నంగా కొనసాగిస్తున్న పరమేశ్వరరెడ్డి ప్రజల దాహార్తిని, ఇబ్బందిని గమనించి అత్యంత భారీ సేవా కార్యక్రమంగా త్రాగునీటి సరఫరాకేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆత్మకూరు పట్టణంలో ఏర్పాటు చేసిన మున్సిపల్ బస్టాండు వద్ద తాగునీటి సౌకర్యం కల్పించలేదు. దాంతో నిత్యం రాకపోకలు సాగించే ప్రయాణీకులు దాహార్తితో అల్లాడుతుండేవారు. నెల్లూరుపాళెం కూడలివద్ద నిత్యం నలుమూలలనుండి రాకపోకలు సాగించే ప్రయాణీకులు కూడా తాగునీటి సమస్యతో సతమతమవుతుండేవారు. ఈపరిస్థితిని నేరుగా గమనించిన కంచి పరమేశ్వరరెడ్డి మున్సిపల్ బస్టాండు, నెల్లూరుపాళెం కూడలిలో త్రాగునీటి సరఫరాకేంద్రాలను ఏర్పాటు చేయడంతోపాటు బస్టాండువద్ద మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేశారు. మున్సిపల్ బస్టాండువద్ద రోజుకు 2వేలమంది త్రాగునీటిని, 500మంది సగటున మజ్జిగను పొందుతూ తమ దాహార్తిని తీర్చుకుంటున్నారు. నెల్లూరుపాళెం వద్ద రోజుకు 1500మంది తాగునీటిని పొందుతున్నారు. జిల్లా ప్రభుత్వవైద్యశాల వద్ద ఇటీవల కంచి చలివేంద్రను ఏర్పాటుచేసి తాత్కాలిక షెల్టరును, బెంచీలను కూడా ఏర్పాటు చేయడంతో ప్రజలకు, రోగులకు, వారి బంధువులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంది.బాగా ఇబ్బందికరంగా ఉన్న మూడు ప్రధానకేంద్రాల్లో బృహత్తర తాగునీటి సరఫరా కార్యక్రమాన్ని ప్రారంభించి దాహార్తిని తీర్చుతున్న కంచి పరమేశ్వరరెడ్డి సేవానిరతిని సర్వత్రా కొనియాడుతున్నారు. అనేక ప్రజాసంఘాలవారు ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

# బోనం అందుకున్న గంగమ్మ తల్లి



**పోతురాజుల వీరంగం, భక్తుల పూనకాలతో పట్టణానికి సరికొత్త శోభ**

**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** శ్రీ గంగమ్మ కొలుపు మహోత్సవం రానే వచ్చింది. పొదల కూరులోని గంగమ్మ అమ్మవారు బోనాలు అందుకోనున్నారు. డప్పు సప్పుళ్లు, తీన్మార్ స్టెప్పులతో పట్టణం మారుమోగింది. పోతు తరాజుల వీరంగం, భక్తుల పూనకాలతో పొదలకూరు సరికొత్త శోభను సంతరించు కుంది. కొలుపు మహోత్సవంలో భాగంగా మూడో రోజైన ఆదివారం బోనాలు సమర్పిం చడం ఆనవాయితీగా వస్తున్నది. ప్రకృతి వైపరీత్యాలు, వ్యాధులు, అనుకోని విపత్తుల నుంచి రక్షించమని గంగమ్మ తల్లికి మొక్కుకుని బోనం సమర్పించడం ఆచారం. అమ్మవారికి బోనాలు సమర్పించే ఉత్సవం అంగరంగ వైభవంగా సాగింది. డీజే పాటలు, యువత నృత్యాలతో అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కోరిన కోర్కెలు తీర్చాలని, చల్లగా చూడాలని కోరుతూ బోనాలను సమర్పించి మొక్కులు తీర్చుకు న్నారు. డప్పు, డోలు, కొమ్మలోళ్ళ విన్యాసాల మధ్య మహిళా భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో బోనాలను తలపై పెట్టుకుని అమ్మవారికి సమర్పించారు. పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలంతా ఎలాంటి రోగాల బారిన పడకుండా క్షేమంగా ఉండాలని, పంటపొలాలు, మనుషుల జీవితాలు పచ్చగా ఉంచమని గంగమ్మతల్లిని కోరుకున్నారు. శక్తి స్వరూపం అయిన అమ్మవారిని ప్రసన్నం చేసుకున్నారు. ఈ ఏడాదికి తాము అనుకున్నట్లు జరిగితే వచ్చే ఏడాది యాట కోసి, జాతర మరింత ఘనంగా నిర్వహిస్తామని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద గొల్ల మద్దిరిళ్ళ నరసింహులు యాదవ్, ఛైర్మన్ వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షులు పడ్డాల. వేమయ్య, సెక్రటరీ కుమార్,ట్రెజరర్ శ్రీధర్, యరగర్ల జయరామయ్య, అన్నదానపు కృష్ణయ్య, గోమసాని వేణు, వెడిచర్ల మురళి, పీపీఎన్ ప్రసాద్ యాదవ్, గోళ్ళ పద్మనాభం, కండే వాసు, పడ్డాల రాము, మదిరిళ్ళ పెంచల స్వామి, రాజేష్, భాస్కర్, వాకా శివ, కుమార్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థుల కొరకు ఆర్థిక సహాయం అందజేత



**చేజర్ల, మేజర్‌న్యూస్ :** చేజర్ల గ్రామ రిటైర్డ్ టీచర్ జి.శ్రీధర్‌రావు ప్రథమ వర్ధంతి సందర్భంగా ధర్మపత్ని స్వర్ణగౌరీ వారు ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచే పేద విద్యార్థులకు ప్రతి సంవత్సరం ప్రోత్సాహక బహుమతులు ఇచ్చేందుకు 50వేలు ఆర్థిక సహాయాన్ని యూటీఎఫ్ సీనియర్ నాయకులు ఏ.సుబ్బరత్నం, ఎం.రవిబాబులకు ఆదివారం అంద జేశారు. యుటిఎఫ్ చేజర్ల మండల శాఖ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిరుపేద విద్యార్థులపై చదువుల కోసం ఆర్థిక సహాయం అందించడం, మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదవ తరగతి విద్యార్థులం దరికీ ప్రతి సంవత్సరం యుటిఎఫ్ ముద్రించిన మోడల్ టెస్ట్ పేపర్లు ఉచి తంగా అందజేయడం వంటి కార్యక్రమాలతోపాటు ఎన్నో పేద కుటుం బాలకు ఆర్థిక సహాయం చేసి ఉన్నారు. స్వర్ణ గౌరీ మండల శాఖకు అందించిన సహాయానికి ధన్యవాదాలు తెలియజేస్తూ, ఈ మొత్తాన్ని కూడా పేద విద్యార్థుల కొరకు వెచ్చించడం జరుగుతుందని యుటిఎఫ్ నాయ కులు రవిబాబు, సుబ్బరత్నం, ఎన్.రమణయ్య, ఆర్‌వి కృష్ణారెడ్డి, ఏ.సుబ్ర హ్మణ్యం, ఏ.వెంకటేశ్వర్లు, ఎన్.బుజ్జయ్య, మస్తాన్ బాషా తెలియజేశారు.

## సముద్రంలో యువకులు మృతి చెందడం బాధాకరం : ఎమ్మెల్యే



**కావలి, మేజర్‌న్యూస్ :** సముద్రపు వేటలో ఇద్దరు యువకులు మృతి చెందడం బాధాకరమని కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి అన్నారు. కావలి రూరల్ మండలం తుమ్మలపెంట సముద్రంలో వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు ఇద్దరు యువకులు మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే, వెంటనే స్థానిక ఏరియా వైద్యశాలకు వెళ్లి యువకుల మృతదేహాలను దర్శించారు. వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇది దురదృష్టకర సంఘటన అని అన్నారు. సముద్ర వేటకు వెళ్లిన ముగ్గురులో ఇద్దరు మృతి చెందడం చాలా బాధాకరం అన్నారు. బోటు లేకుండా వేటకు పోవడంతోనే ప్రమాదం జరిగి మృతి చెందారన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తానని తెలిపారు.

# జగన్మోహన్ రెడ్డికి ధన్యవాదాలు : కాకాణి పూజిత రెడ్డి




**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర వైయస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తనకు రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెం ట్‌గా నియమించడం ఎంతో సంతోషంగా ఉంద ని రాష్ట్ర మహిళా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత తెలిపారు. ఆదివారం నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డికి తమ కుటుంబ సభ్యులంతా రుణపడి ఉంటామని పేర్కొన్నారు. తన పైన ఇంత నమ్మకం ఉంచి నాకు బాధ్యత అప్పచెప్పిన దానికి ఆయనకి ఎంతో రుణపడి ఉంటానని పేర్కొన్నారు. ఎక్కడో నియోజక వర్గ స్థాయిలో పనిచేస్తున్నటువంటి తనకు ఇంత పెద్ద అవకా శం ఇచ్చి తనను ముందుకు నడిపించారని తెలిపారు. తనకు వచ్చినటువంటి ఈ అవకా శాన్ని నేను బాధ్యతగా పనిచేస్తానని తెలిపారు. తనకు ఇచ్చిన పదవికి వన్నె తెచ్చే విధంగా పనిచేస్తానని వివరించారు. జగన్మోహన్‌రెడ్డి తీసుకున్నటువంటి ఈ నిర్ణయం కరెక్ట్ అని నిరూ పించడానికి తాను ఖచ్చితంగా కష్టపడతాన న్నారు. తన తండ్రి జైలుకి వెళ్లి నేటికీ రోజుటికి 75రోజులు కావస్తున్నా, బయటకు వచ్చేస్తారని మేము రోజు అనుకుంటున్నామన్నారు. కేసుల పైన కేసువేయడం పీటీ వారెంట్లు వేసి, మమ్మల్ని మానసికంగా వేధిస్తున్నప్పుడు మాకు ధైర్యం చెప్పినటువంటి వ్యక్తి జగన్మోహన్‌రెడ్డి అని తెలి పారు. జగన్మోహన్ రెడ్డి ఫోన్ చేసి నన్ను ఓదార్చిన తర్వాత, నాన్న కోసం ఇంత దూరం నెల్లూరు వచ్చి, ఆయన్ని పలకరించి మా అందరికీ మరొకసారి ధైర్యం చెప్పేసి వెళ్ళారాని తెలిపారు. సర్వేపల్లి నియోజక వర్గ ప్రజలు, కార్యకర్తలు, వైసీపీ నాయకులు, జిల్లా స్థాయిలో నాయకులు, రాష్ట్రం మొత్తం కూడా తన తండ్రికి అండగా నిలిచిందన్నారు. ఈ సమావేశంలో నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు సునంద, వెంకట జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపై చర్యలు చేపట్టండి : ఎంపీపీ పద్మజా రెడ్డి

**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** సీజనల్ వ్యాధులపై ముందస్తు చర్యలు చేపట్టాలని ఏఎస్ పేట ఎంపీపీ బి పద్మజా రెడ్డి పేర్కొన్నారు ఆదివారం ఏఎస్పేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ పద్మజారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ప్రసన్న కుమారి మాట్లాడుతూ.. మండలంలోని అధికారులు సిబ్బంది సమయపాలన పాటించి ప్రజా ప్రతినిధుల సహకారంతో మండల అభివృద్ధికి సహకరించాలని సూచించారు. చిరమణ ఏఎస్ పేట వైద్యాధికారులు మాట్లాడుతూ.. ప్రభుత్వ పరంగా అందించే కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వారంలో రెండు రోజులు ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని వ్యాధులు రాకుండా చూసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నులిపురుగుల నివారణ దినోత్సవం వాల్పోస్టర్లు ఎంపీపీ పద్మజారెడ్డి ఎంపీడీవో ప్రసన్నకుమారి చేతుల మీదుగా ఆవిష్కరించారు మాట్లాడుతూ.. మండలంలో 8175 జాబ్ కార్డ్ ఉన్నాయని అందులో 5862మంది యాక్టివ్‌గా ఉన్నట్లు తెలిపారు. అలాగే ఇప్పటివరకు 92,415 పని దినాలు కల్పించామని పేర్కొన్నారు. అలాగే హార్టికల్చర్ సంబంధించి చిన్న సన్నకారు రైతులకు నూరు శాతం సబ్సిడీతో పనులు కల్పిస్తున్నట్లు తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే పిఆర్‌ఏఈ ఖాదర్‌మస్తాన్ మాట్లాడుతూ.. మండలంలో పలు గ్రామాల్లో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడం జరిగిందని ఇంకా కొన్ని గ్రామాలకు సిమెంటు రోడ్డు పనులు మంజూరైనట్లు తెలిపారు. ఎంఈఓ జ్యోతి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో 2719 మంది విద్యార్థులు పాఠశాలల్లో చదువుతున్నట్లు తెలిపారు. అలాగే 168మంది ఉపాధ్యాయులకు 158మంది ఉపాధ్యాయులు ఉన్నారని తెలిపారు. తల్లికి వందనం ద్వారా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నిధులు జమ చేసిందని తెలిపారు. అయితే మండలంలో పలు గ్రామాల్లోని కొంతమంది అర్హులైన వారికి తల్లికి వందనం రాలేదని ఎంపీపీ పేర్కొన్నారు. వారందరికీ వచ్చే విధంగా చర్యలు చేపడతామని ఎంఈఓ తెలిపారు. ఆర్డబ్ల్యూఎస్ ఏఈ రవితేజ మాట్లాడుతూ.. మండలంలో జల్జీవన్ ద్వారా 14 పనులు మంజూరైనాయని ఇప్పటివరకు 11 పనులకు టెండర్లు పూర్తయినట్లు పేర్కొన్నారు. మిగిలిన మూడు పనులకు వివిధ సమస్యలతో పెండింగ్లో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ పనులను పది రోజుల్లో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అలాగే పెన్నా నీరు ఏఎస్ పేటకు గత మూడు నెలల నుంచి రావడంలేదని సభ దృష్టికి తేవడంతో తరచూ ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతుకు గురవడంతో ధర్నా నుంచి ఏఎస్ పేటకు తాగునీరు రావడంలేదని రెండు మూడు రోజుల్లో పెన్న నీరు ఏఎస్ పేటకు సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే హౌసింగ్ ఏఈ వివేక్ మాట్లాడుతూ.. మండలంలో 1093 పక్కా గృహాలు మంజూరైనట్లు అందులో 110 ఇల్లు పూర్తయినాయని మిగిలినవి వివిధ దశల్లో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు ఆ శాఖకు సంబంధించిన విషయాలను వివరించారు. అలాగే అనుమసముద్రం




సర్పంచ్ హజరతమ్మ మాట్లాడుతూ గ్రామానికి సర్పంచ్‌గా ఉండి కూడా గ్రామంలోని స్మశానానికి ఒక్క బోరు మంజూరు చేయించుకోలేక ఉన్నానని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఎంపీపీ పద్మజా రెడ్డి మాట్లాడుతూ మండల పరిషత్‌లో ఉన్న నిధులను ఎంపీటీసీ సభ్యులకు విడుదల చేసి గ్రామాల్లోని అభివృద్ధికి సహకరించాలని కోరారు. సంవత్సరం నుంచి నిధులు ఉన్న మంజూరు చేయడం లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు సర్పంచులు ఏటీఎం సతీష్ ఐసిడిఎస్ సూపర్వైజర్లు కస్తూరి డాక్టర్లు ఆయేషా జ్యోతి రాణి పంచాయతీ కార్యదర్శులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# టైలర్ల సంక్షేమానికి కృషి చేస్తా : మంత్రి నారాయణ

**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** టైలరింగ్ వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్న కుటుంబాలకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందని రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. మంత్రి నారాయణ క్యాంపు కార్యాలయంలో మంత్రితో నెల్లూరు జిల్లా టైలర్స్ అసోసియేషన్ నేతలు ఆదివారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా టైలర్స్ కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు మీ సహకారం కావాలని నేతలు మంత్రికి కోరారు. స్పందించిన మంత్రి కమ్యూనిటీ హాల్ కోసం తన వంతు సహకారం కచ్చితంగా అందిస్తానని మంత్రి నారాయణ తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందించడం పట్ల నెల్లూరు జిల్లా టైలర్స్ సంఘం నేతలు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం మంత్రికి శాలువాలతో సన్మానించి చిత్రపటాన్ని బహుకరించారు. కార్యక్రమంలో జిల్లా టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.బాబు, కార్యదర్శి పి.యానాదయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.మురళీ క్రిష్ణ, సిటీ అధ్యక్షులు గులాం ఖాదర్, జిల్లా ట్రెజరర్ ఎస్‌కే బాబు, జిల్లా ఉపాధ్యక్షులు వి.శీనయ్య తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి ఇంటా జెండా పిలుపుతో బీజేపీ యువత దేశభక్తి ప్రదర్శన



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముందుగా 'హర్ ఘర్ తిరంగా' యాత్రలో భాగంగా రామలింగాపురం మండలం, 19వ డివిజన్ లెక్చరర్స్ కాలనీ నుంచి ముత్తుకూరు బస్టాండ్ గేటు వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ బైక్ ర్యాలీకి బిజెపి జిల్లా నాయకులు చిలకా ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. జాతీయ జెండాలను ఎగురవేస్తూ, దేశభక్తి నినాదాలతో వందలాది బైకర్లు కవాతు నిర్వహించారు. రోడ్లపై తిరంగాలతో కదిలిన ఈ దృశ్యం ప్రజల్లో దేశభక్తి జ్వాలను రగిలించింది. ఈ సందర్భంగా చిలకా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. 'తిరంగా మన జాతి గౌరవానికి ప్రతీక. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహానుభావుల త్యాగాలను స్మరించుకుంటూ, ప్రతి ఇంటి మీద జాతీయజెండా ఎగరాలి. ఈ 'హర్ ఘర్ తిరంగా' బైక్ ర్యాలీ ద్వారా, స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతి పౌరుడి హృదయంలో దేశభక్తి జ్వాల రగల్చడమే మాలక్ష్యం. యువత ఉత్సాహంగా పాల్గొనడం ఆనందదాయకం. మన అందరం ఐక్యతతో దేశ అభివృద్ధికి కృషి చేద్దాం' అన్నారు. ఈ కార్యక్రమం ప్రాంతీయ యువతలో దేశభక్తి స్ఫూర్తిని నింపడంలో విశేషంగా తోడ్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో రామలింగాపురం మండల అధ్యక్షులు అడపాల మదన్ సాయిరెడ్డి, నారాయణ, అవినాష్ కిరణ్, నాయకులు ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.

# దూదేకుల సంఘం యూత్ అధ్యక్షులుగా షేక్ మస్తాన్

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా దూదేకుల సంఘం యూత్ అధ్యక్షులుగా బ్రహ్మదేవి గ్రామానికి చెందిన షేక్ మస్తాన్ (అగ్ని) నియామకం కావడం జరిగింది. ఆదివారం రాష్ట్ర యూత్ అధ్యక్షులు డీపీ మస్తాన్ సమక్షంలో ఈ సంఘానికి సంబంధించిన నెల్లూరు జిల్లా యూత్ సమావేశం జరిగింది. సమావేశంలో జిల్లా యూత్ బాధ్యతలను మస్తాన్‌కు అప్పగించారు. ఈ నేపథ్యంలో యూత్ ప్రధాన కార్యదర్శిగా షేక్ షరీఫ్, కోశాధికారిగా షేక్ మహమ్మద్‌ను నియమించి అభినందించారు. అనంతరం జిల్లా యూత్ అధ్యక్షులు షేక్ మస్తాన్ మాట్లాడారు. నెల్లూరు జిల్లా యూత్ అధ్యక్షులుగా రెండోసారి పదవి బాధ్యతలను అప్పగించినందుకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులు కె.పీర్ మహమ్మద్, రాష్ట్ర యూత్ అధ్యక్షులు డీపీ మస్తాన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడారు. నెల్లూరు జిల్లాలోని అన్ని మండలాలకు యూత్ కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు షేక్ సలీమ్, గౌరవ అధ్యక్షులు షేక్ మహబూబ్ బాషా, యూత్ ప్రధాన కార్యదర్శి షేక్ షరీఫ్, కోశాధికారి మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.



# ఒలేటి నాగేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించిన కాటంరెడ్డి



**కావలి, మేజర్‌న్యూస్ :** సీనియర్ పాత్రికేయులు ఒలేటి నాగేశ్వరరావు మృతి పాత్రికేయ రంగానికి వ్యక్తిగతంగా నాకు తీరని లోటు అని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. ఆయన ఆదివారం నాగేశ్వరరావు నివాసానికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించి ఆ కుటుంబానికి అండగా ఉంటామని, ఆయన మృతి పట్ల తమ సంతాపాన్ని తెలియజేశారు. అలానే ఆయన ఒక పాత్రికేయులు గా రాణిస్తూ ఆర్యవైశ్యులకు అండగా ఉంటు వారి సమస్యల పట్ల స్పందిస్తూ, సామాజికంగా, సమాజ సేవలో తన వంతు పాత్ర పోషించారని తెలిపారు. ఆయన ఆశయాలను కావలిలో జర్నలిస్టులు కొనసాగించాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. నాకు అనారోగ్య సమస్యతో ఆరోజు రాలేకపోయానని భగవంతుడు వారి కుటుంబానికి అండగా ఉండాలని ఆకాంక్షించిచారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకులు కృష్ణంరాజు, గోసల గోపాల్ రెడ్డి, పద్మనాభ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎంపిక



**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలో పొదలకూరు రోడ్‌లోని స్థానిక హెచ్ఆర్ కళ్యాణమండపం నందు నెల్లూరు జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షులుగా డాక్టర్ మన్నెం సతీష్, ప్రధాన కార్యదర్శిగా కొండా మాధవయ్య, కోశాధికారిగా శ్రీ వార్త రాజేంద్ర ప్రసాద్‌ను ఆదివారం ఎన్నుకొనడం జరిగింది. ఈ కార్యక్రమంకు ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా పముజుల నాగేశ్వరరావు రిటైర్డ్ ఎస్ఈ పంచాయతీ రాజ్ డిపార్ట్మెంట్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా గౌరబత్తిన హజరత్ ప్రభుత్వ ప్రధానోపాధ్యాయులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు సజ్జా సతీష్ కుమార్, సహాయ కార్యదర్శి చెప్పరం మల్లికార్జున, గౌరవ అధ్యక్షులు అయిన కర్ణ రాఘవ రావు, కన్నా మధుసూధ, జాగబత్తిన శైలేష్, కార్యవర్గ సభ్యులు, జిల్లా వ్యాప్తంగా విచ్చేసిన దేవాంగ ఆత్మీయులు అందరు పాల్గొన్నారు.

# చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులు మృతి



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి రూరల్ మండలం మత్స్యకారుల గ్రామాలైన తుమ్మలపెంటలో ఆదివారం విషాదకరమైన సంఘటన చోటు చేసుకుంది. మత్స్యకారులు సముద్రంలో చేపల పట్టేందుకు వల వేసి ఉన్నారు. అనంతరం మరల తిరిగి ఆ వాళ్ల దగ్గరకు వెళుతున్న సమయంలో అక్కడ ఏమి జరిగిందో ఏమో తెలియదు. కానీ ప్రమాదశాత్తుగా అక్కడ మునిగిపోవడం జరిగింది. ఇంతలోనే అక్కడ పర్యవేక్షిస్తున్న మెరైన్ పోలీసులు ప్రమాదాన్ని పసిగట్టిన వెంటనే వారు ఒక తెప్ప లాంటి బోటు మీద సమయస్ఫూర్తితో ప్రమాదాన్ని గ్రహించి వేగంతో వెళ్లి ఆ అక్కడ ప్రమాదాన్ని గ్రహించి ఉన్న ఇద్దరి బాడీలను ఆ ఓటు మీద వేసుకొని రావడం జరిగింది. లేకపోతే ఆ మృతదేహాలు కూడా లభ్యమయ్యేవి కాదని, మేరైన్ పోలీస్ సమయస్ఫూర్తి వలన మృతదేహాలు దొరికినవి లేకపోతే మృతదేహాలు 2రోజులు తర్వాత అవి సముద్రపు ఎక్కడో అంచులో కొట్టుకోవచ్చని మత్స్యకారులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఆ ప్రాంతపు పల్లె కారులు మెరైన్ పోలీసుల్ని అభినందించారు.

# శిలాఫలకాలను ధ్వంసం చేసిన వారు అరెస్టు



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి మండలంలో తుమ్మలపెంట గ్రామంలో 2021 సంవత్సరంలో కింద అప్పటి మంత్రి జల జీవన్ మిషన్ ప్రాజెక్టును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. వాటిని ధ్వంసం చేయడం జరిగింది. వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముద్దాయిలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం డిఎస్పి మాట్లాడుతూ.. రాజకీయ విద్వేషా లు రెచ్చగొట్టే విధంగా ఉన్నాయని ఇటువంటి మరల పునరావృతం కాకుండా ఉండాలని లేకపోతే కఠిన చర్యలు తప్పు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ సిఐ, ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంటర్ విద్యార్థిని ఉరేసుకుని ఆత్మహత్య

**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** నెల్లూరులోని అన్నమయ్య సర్కిల్ వద్ద ఉన్న ఆర్ఎన్ఆర్ కాలేజీలో మొదటి సంవత్సరం ఇంటర్ చదువుతున్న విద్యార్థిని ఆదివారం ఉరివేసుకొని ఆత్మహత్య చూసుకుంది. తిరుపతి జిల్లా సత్యవేడు మండలం రాసపాల్యానికి చెందిన హేమశ్రీ ఆర్ఎన్ఆర్ ఇంటర్ కాలేజీలో మొదటి సంవత్సరం ఇంటర్ చదువుతున్నది. హాస్టల్లో ఉంటున్న విద్యార్థిని ఆదివారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కాగా తల్లిదండ్రులు వారి బిడ్డను కాలేజీ యాజమాన్యమే చంపేసిందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తమకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా కాలేజీ యాజమాన్యం తమ బిడ్డ మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థిని మరణం తెలుసుకొని పెద్ద ఎత్తున విద్యార్థిని తల్లిదండ్రులు బంధువులు కాలేజీ ముందు నిరసన తెలియజేశారు. తమ బిడ్డను తమకు తెచ్చివాలంటూ తల్లిదండ్రులు ఆర్తనాథలతో కన్నీరు మున్నీరయ్యారు. విద్యార్థిని తల్లిదండ్రులు రావడంతో కాలేజీ వదిలి పారిపోయిన యాజమాన్యం. కోపగుద్దులు అయినా విద్యార్థిని బంధువులు, విద్యార్థి సంఘ నాయకులు స్వల్పంగా కాలేజీ ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. సమాచారం అందుకున్న వేదయపాలెం సీఐ శ్రీనివాస రావు సంఘటన స్థలానికి చేరుకొని విద్యార్థిని చనిపోయిన కూడా కళాశాల యజమాన్యం కనీసం పోలీసులకు సమాచారం ఇవ్వలేదని, ఫోన్లు సైతం ఆఫ్ చేసుకొని వెళ్లిపోయారని తెలియజేశారు. అయితే తల్లిదండ్రులు మాత్రం తమ బిడ్డ మృతి అనుమానాలకు తావిస్తుందని అయితే ఇంకా తాము ఫిర్యాదు ఇవ్వాల్సి ఉందని




ఫోన్లో దీనిపై పూర్తిస్థాయిలో చేస్తున్నామని, పోస్టుమార్టం రిపోర్టులో అన్ని విషయాలు తేటతెలమవుతాయన్నారు.

# నామినేటెడ్ పదవులు పొందిన జనసేన నాయకులుకు సత్కారం




**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** తల్లి దండ్రులు లేని చిన్నారులను భగవంతుని బిడ్డలుగా.. తన జీతాన్ని పంచుతూ వితంతు ఆడపడుచులకు రాఖీ కానుకలు పంపి తన ఔన్నత్యాన్ని చాటుకున్న ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సంకల్పం ప్రజా సేవ, నామినేటెడ్ పదవులు పొందిన నాయకులు వారి ఆశయాన్ని ముందుకు నడిపిద్దామని నెల్లూరు సిటీ పర్యవేక్షకులు, జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కిషోర్ గునుకుల పేర్కొన్నారు. ఈ సందర్భంగా కిషోర్ గునుకుల మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ సఖ్యత ను తెలియజేసే విధంగా జనసేన పార్టీకి కష్టపడిన వారికి నామినేటెడ్ పదవులు దక్కడం అభినందనీయమన్నారు. నామినేటెడ్ పదవులు పొందిన నాయకులకు జనసేన పార్టీ తరపున శుభాకాంక్షలు తెలియజేశారు. పవన్ కళ్యాణ్ ఆశయాలతో ప్రజా సేవ కుఅంకితం కావాలని, ఇదే మా పెద్దాయన జనసేన పర్యవేక్షకులు వేములపాటి అజయ్ కుమార్ సూచన అని, ఒక మంచి వ్యూహంతో ప్రభుత్వ అధికార భాగస్వామ్యం తీసుకుంటూ ప్రజలకు సేవ చేసే లక్ష్యాన్ని చేరుకుంటున్న పవన్ కళ్యాణ్ నిర్ణయం ఏదైనా బాధ్యతగా ప్రజల్లోకి తీసుకు వెలుదామన్నారు. ఈ కార్యక్రమంలో పది నియోజకవర్గాల్లోని జనసేన నామినేటెడ్ పొందిన పదవులు పొందిన జనసేన నాయకులు వీర మహిళలతో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, కార్యాలయం ఇన్‌చార్జ్ జమీర్, సీనియర్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, జనసేన పార్టీ లీగల్ నాయకులు శ్రీరామ్, వీర మహిళలు గజరాజు శాంతి కల, కస్తూరి, రాధమ్మ, నందిని, లక్ష్మీ, జనసేన నాయకులు, జనసైనికులు వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.




## నగరి గంగ జాతర ఘనంగా జరుపుకుందాం

**నగరి, మేజర్‌న్యూస్ :** నగరి శివాలయం నందు గంగ జాతర ఘనంగా నిర్వహించుటకు గంగ జాతర నిర్వాహకులు ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ప్రతి ఏడాది లాగే ఈ సంవత్సరం కూడా గంగజాతర, ఘనంగా నిర్వహించాలని ప్రతి ఒక్కరూ గంగ జాతర నిర్వహించుటలో భాగస్వాములు కావాలని, అందుకు పురప్రజలు అందరూ సహకరించాలని నిర్వాహకులు చిరంజీవి రెడ్డి కోరారు. గ్రామ పెద్దలు, ప్రజలు, యువకుల సలహాలు తీసున్నారు. ఆ మేరకే ఈసారి గంగజాతర ఘనంగా నిర్వహిస్తామన్నారు. సెప్టెంబర్ 2వ తేదీ మంగళవారం రాత్రి చాటింపు, 9, 10, 12 తేదీలలో గంగ జాతర జరుగుతుందన్నారు. గ్రామ సభలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో జ్యోతి రెడ్డి,ఆనం సురేష్, దయానిధి, కృష్ణారెడ్డి, గుణశేఖర్, జ్యోతి నాయుడు, ఆర్.బాబు, గోపాల్ రెడ్డి, ఎల్‌కె.రామన్ హరిబాబు, బాబు రెడ్డి, రామమూర్తి యాదవ్, శ్రీనివాసులు, శ్రీనివాసన్, చలపతి, ఇంద్రయ్య, విలేకరి మణి, బాబు, వెంకటముని, రామ్మూర్తి యాదవ్, రమేష్, సుబ్రహ్మణ్యం, కోలా బాలాజీ, మణి, వేలు, కుమార్, మునిరత్నం, వీరయ్య, గిరి మురళి, జనార్ధన్, శంకర్, ధన, రాజేష్, మహేష్, అశోక్, విక్కీ, సునీల్ పాల్గొన్నారు.

## వేగవంతంగా సాగుతున్న అభివృద్ధి పనులు

**కుప్పం, మేజర్‌న్యూస్ :** కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపేటలో నిరుపయోగంగా ఉన్న పాత మార్కెట్ యార్డు కూల్చివేత పనులు వేగంగా జరుగుతోంది. కుప్పం ముద్దుబిడ్డ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూచనలతో




కుప్పం కొత్తపేటలో శిధిలావస్థలో ఉన్న పాతమార్కెట్‌యార్డును కూల్చి డీఎస్పీ కార్యాలయం, ఆర్డీఓ కార్యాలయ నిర్మాణం చేపట్టడం జరుగుతుందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఇంచార్జి పి.ఎస్.మునిరత్నంలు తెలిపారు. కొత్తపేట అభివృద్ధి పదంలో ముందుకు దూసుకుపోతుందని కొత్తపేట టీడీపీ నాయకులు తెలిపారు. కూటమి ప్రభుత్వంలో కొత్తపేట అభివృద్ధి జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, ప్రభుత్వ అభివృద్ధి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌కి, ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నంకి, డాక్టర్ సురేష్ బాబుకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ కన్నన్, కొత్తపేట ఇంచార్జ్ (అప్పు) ముఖేష్, కో ఇంచార్జ్ తిరుమగల్, కో యూనిట్ ఇంచార్జ్ వరదరాజులు, టిఎన్ఎస్ఎఫ్ మునియప్ప, బూత్ కన్వీనర్ కృష్ణ, 15వ వార్డు పార్టీ అధ్యక్షులు సుకుమార్, హరినాథ్ గౌడ్, 13వ వార్డు పార్టీ అధ్యక్షులు లోకి, బూత్ కన్వీనర్ మోహన్,అనౌన్స్మెంట్ మురళి, రాసుకుట్టి పాల్గొన్నారు.

## గుండ్లపాలెం పీఏసీఎస్ చైర్మన్‌గా పముజుల ప్రదీప్

▸ పార్టీని నమ్ముకున్న వారికి మరో కీలక పదవి



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్‌లో అత్యంత కీలకమైన గుండ్లపాలెం ప్రాథమిక వ్యవసాయ కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా సౌత్ మోపూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత పముజుల ప్రదీప్‌ను నియమించారు. ఈ మేరకు కాసేపటి క్రితం ఉత్తర్వులు జారీ అయ్యాయి. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేసేందుకు పముజల ప్రదీప్ తన వంతు శక్తివంచన లేకుండా కృషి చేశారు. గత ఐదు సంవత్సరాలుగా నెల్లూరు రూరల్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడుగా ఆయన క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి సహాయ సహకారాలతో ప్రదీప్‌ను గుండ్లపాలెం పిఎసిఎస్ చైర్మన్‌గా నియమించారు. తెలుగుదేశం పార్టీని నమ్ముకొని మొదటి నుంచి పనిచేసే వ్యక్తులకు పెద్ద పేట వేసి పదవులను ఇస్తున్నారు. అతి త్వరలోనే జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కూడా భర్తీ చేయనున్నారు.

### ఇరుకళల పరమేశ్వరి అమ్మవారికి

## పూలంగి సేవ, పల్లకి సేవ

▸ ఉభయకర్తలుగా వ్యవహరించిన హరిణి క్యాటరింగ్స్



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు గ్రామ దేవత శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శ్రావణమాసం సందర్భంగా ఆదివారం అమ్మవారికి ప్రత్యేక అలంకారం నిర్వహించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానంలో పూలంగి సేవ, పల్లకి సేవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా హరిణి హెూటల్, హరిణి క్యాటరింగ్స్ అధినేత సిహెచ్ పెంచలయ్య విజయలక్ష్మి దంపతులతో పాటు కీర్తి ప్రియా, నివిణ్యలు వ్యవహరించారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి కృష్ణ ఫెస్టివల్ కమిటీ చైర్మన్ ఓట్టూరు సురేంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### రెండు బైకులు ఢీ..

## అక్కడికక్కడే ఇద్దరు మృతి

▸ మరో ముగ్గురికి స్వల్ప గాయాలు

**చిట్టమూరు మేజర్‌న్యూస్ :** మండలంలోని మొలకల పూడి సమీపంలో ఆదివారం మధ్యాహ్నం రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరు మృతి చెందగా, మరో ముగ్గురు గాయ పడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గొట్టిప్రోలు నుండి నాయుడుపేట వైపు వెళ్తున్న స్కూటరిస్టును, అపాచీలో కార్మికుడిగా పనిచేస్తూ డ్యూటీ ముగించుకుని వాకాడు వైపు వెళుతున్న స్కూట రిస్టు ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురు స్వల్పగాయాలైన సంఘటన ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. వాకాడుకు చెందిన కావలి కిరణ్ అలియాస్ బద్రి(25), నాయుడుపేట మండలం పెన్నేపల్లికి చెందిన వెంకటరమణయ్య (45) అక్కడికక్కడే మృతి చెందారు. వెంకటరమణయ్యతో పాటు వస్తున్న మహిళకు,ఇద్దరు పిల్లలకి స్వల్ప గాయాలయ్యాయి. గాయాలైన వారిని 108సాయంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించా రు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలిసిన వెంటనే స్థానిక ఎస్ఐ చిన్న బలరామయ్య సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకుని, సహాయక చర్యలు చేపట్టారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

# ఆత్మకూరు డివిజన్ రెవిన్యూసర్వీసెస్ అసోసియేషన్ కమిటీ ఏకగ్రీవం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రెవిన్యూసర్వీసెస్ అసోసియేషన్ ఆత్మకూరు డివిజన్‌కమిటీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆత్మకూరులోని తహశిల్దారు కార్యాలయం వద్ద ఉదయం నుండి అసోసియేషన్ సభ్యులందరూ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ ఎన్నికలకు మహ్మద్‌గయాజ్, జి.సతీష్‌లు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. డివిన్‌లోని అన్ని మండలాలకు చెందిన అసోసియేషన్ సభ్యులు హాజరుకాగా జిల్లా నాయకులు అల్లంపాటి పెంచలరెడ్డి ప్రసంగించారు. అసోసియేషన్ కార్యకలాపాలు, నూతన కమిటీ ఏర్పాటు, రానున్న రోజుల్లో చేపట్టాల్సిన పోరాటాల కార్యాచరణ గురించి ఆయన వివరించారు. చర్చలనంతరం నూతన కార్యవర్గంలోని ఒక్కో పోస్టుకు ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో వారు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లుగా ఎన్నిలకఅధికారులు ప్రకటించి వారికి ధృవీకరణపత్రాలను అందజేశారు. ఆంధ్రప్రదేశ్ రెవిన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆత్మకూరు డివిజన్ అధ్యక్షుడుగా ఉదయగిరి తహశిల్దారు ఎల్.రామ్మోహన్, కార్యదర్శిగా ఆత్మకూరు తహశిల్దారు కార్యాలయ డిప్యుటితహశిల్దారు డి.శాంతిస్వరూప్‌లు ఎన్నికయ్యారు. అసోసియేట్ అధ్యక్షుడుగా ఏఎస్‌పేట డిప్యుటి తహశిల్దారు జి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా సీతారామపురం డిప్యుటి తహశిల్దారు ఎస్.కె.సంధాని, కలువాయి మండల డిప్యుటితహశిల్దారు డి.వెంకటేవ్వర్లు, అనంతసాగరం మండల ఆఫీస్ సబార్డినేట్ మీరామొహిద్దీన్, సంయుక్తకార్యదర్శులుగా సంగం మండల సీనియర్‌నాయకుడు బి.శ్రీనివాసులు, ఏఎస్‌పేట రీసర్వే డిటి కె.విజయఎకుమార్, ఉదయగిరి మండల రీసర్వే డిటి కె.శ్రీనివాసులు, కోశాధికారిగా మర్రిపాడు మండల రెవిన్యూ ఇన్స్‌పెక్టర్ సాయికిరణ్, కార్యవర్గ సభ్యులుగా ఆత్మకూరు తహశిల్దారు కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కె.పెంచలయ్య, ఆత్మకూరు ఆర్డీవో కార్యాలయ సీనియర్ నాయకుడు పి.రవిబాబు, ఆత్మకూరు మండల రీసర్వేడిటి టి.రాజు, జిల్లా కౌన్సిలర్‌లుగా ఆత్మకూరు ఆర్ఎస్‌డిటి టి.రాజనారాయణ, అనంతసాగరం మండల రెవిన్యూఇన్స్‌పెక్టర్ ఎస్.రవికుమార్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారందరికి ఎన్నికల అధికారులు గయాజ్, సతీస్‌లు ధృవీకరణపత్రాలను అందజేశారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులు రామ్మోహన్, స్వరూప్‌లను నాయకులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ ఎన్నికలు ఏపిఆర్‌ఎస్‌ఏ జిల్లా నాయకులు అనిల్‌కుమార్‌యాదవ్, బి.మురళి, డి.వి.శేషయ్య ఆధ్వర్యంలో జరిగాయి. నూతన కార్యవర్గాన్ని జిల్లా నాయకులు అల్లంపాటి పెంచలరెడ్డి, కె.డానియల్ పీటర్‌రావు, సి.హెచ్ మురళీకృష్ణ, రామకృష్ణ, ఎన్నికల అధికారులు సన్మానించి వారిచేత అసోసియేషన్ నియమావళిప్రకారం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డివిజన్‌లోని రెవిన్యూ అసోసియేషన్ సభ్యులందరూ హాజరయ్యారు.



# కావలి రెవెన్యూ డివిజన్ అసోసియేషన్ అధ్యక్షునిగా శ్రావణ్ కుమార్

**కావలి, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కావలి డివిజన్ యూనిట్ ఎన్నికలు ఆదివారం కావలి తహసిల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షునిగా కావలి తహసిల్దార్ గాప్రస్తుతం పనిచేయుచున్న శ్రావణ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డిప్యూటీ తహసిల్దార్‌గా ప్రస్తుతం కావలిలో పని చేయుచున్న వీవీఎం రాజు కార్యదర్శిగా ఎన్నికయ్యారు. పి.హేమంత్ కుమార్, కె.శ్రీనివాసులు ఎన్నికల అధికారిగా విధులు నిర్వహించగా జిల్లా నాయకులు లక్ష్మీ నరసారెడ్డి పర్యవేక్షణలో ఈ ఎన్నికలు సమర్థవంతంగా సజావుగా నిర్వహించ గలిగారు. అనంతరం నూతనంగా ఎన్నిక కాబడిన కావలి తాసిల్దార్ శ్రవణ్ కుమార్, వీవీఎం రాజును జిల్లా నాయకులు ఘనంగా అభినందించి శుభాభినందనలు తెలిపారు. అనంతరం



అధ్యక్షులు శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ.. మా మీద నమ్మ కం ఉంచి మమ్మల్ని ఏకగ్రీవంగా ఎన్నికలు చేసిన రెవెన్యూ ఉద్యోగులకు అలాగే జిల్లా నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. డివిజన్ స్థాయిలో ఉద్యోగులకు ఏ సమస్యలు వచ్చినా శక్తి వంచన మేరకు పని చేసేందుకు కృషి చేస్తామని ఉన్నత అధికారుల సూచనలు, సలహాలతో ముందుకు సాగిపోతామని తెలిపారు.

# విద్యార్థులు క్రీడా పోటీల్లో రాణించాలి

## ధనలక్ష్మిపురం నారాయణ రెసిడెన్షియల్ కళాశాల ఏజీఎం బాలకృష్ణారెడ్డి





**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** విద్యార్థులు చదువుతోపాటు క్రీడా పోటీల్లో కూడా రాణించాలని ధనలక్ష్మిపురం నారాయణ రెసిడెన్షియల్ కళాశాల ఏజీఎం బాలకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ధనలక్ష్మిపురం నారాయణ బాలుర రెసిడెన్షియల్ కళాశాలలో స్పోర్ట్స్ మీట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్యారమ్స్, టెన్నిస్, వాలీబాల్ వంటి క్రీడా పోటీలు నిర్వహించి విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. అనంతరం బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయ భాస్కర్ రెడ్డి సూచనల మేరకు రెసిడెన్షియల్ క్యాంపస్లో విద్యార్థులకు వివిధ రకాల ఆటల పోటీలను నిర్వహించడం జరిగిందన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు ఆటవిడుపుగా క్రీడా పోటీలు నిర్వహించడం ద్వారా వారిలో మానసిక స్థైర్యం పెరగడమే కాకుండా మంచి నడవడిక, శారీరక ఆరోగ్యం లభిస్తుందన్నారు. ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులు భవిష్యత్తులో మంచి క్రీడాకారులుగా రాణించాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీజీఎం, డీన్, ప్రిన్సిపాల్, పీఈటీ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.


## నాగులపాడులో అంకాలపరమేశ్వరిదేవి

# విగ్రహప్రతిష్ట రేపటినుండి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలం నాగులపాడులో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆశీస్సులతో శ్రీఅంకాలపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారి నూతన విగ్రహప్రతిష్టామహోత్సవం ఈనెల 12వ తేదీ మంగళవారం నిర్వహిస్తామని గ్రామస్థులు తెలిపారు. ఈనెల 12వ తేదీ నుండి 14వతేదీ వరకు ఈ విగ్రహప్రతిష్ట ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నామని వారు పేర్కొన్నారు. మండలంలోని చెర్లోయడవల్లికి చెందిన బ్రహ్మశ్రీ వేదమూర్తులు, ఆగమశాస్త్రపండితులు, శ్రీకోదండరామస్వామి దేవాలయ ప్రధానఅర్చకులు శ్రీశ్రీశ్రీ దైవజ్ఞగూడా కళ్యాణ్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో ఈకార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 12వతేదీ ఉదయం గణపతిపూజ, పుణ్యాహవచనం, నాంది, దీక్షాబంధనం, కలశస్థాపనములు, రుత్విక్‌వరవరణం, పంచగవ్వారాధనం, మంగళహారతి, తీర్థప్రసాదవితరణ, సాయంత్రం గణపతిపూజ, మృత్యుంగ్రహణం, అంకురారోహణం, యాగశాలప్రవేశం, అగ్నిప్రతిష్ట, అఖండ దీపారాధన, నవగ్రహపంచలోకపాలక అష్టదిక్పాలక, సర్వతోభద్రా వాహనం, జలాధివాసం,మంగళహారతి, తీర్థప్రసాదవితరం కార్యక్రమాలుంటాయన్నారు. 13వతేదీన ఉదయం ప్రాత:కాలగణపతిపూజ, వేదపారాయణం, వాస్తుహోమం, అవాహితదేవతాహోమాలు, అధివాస హోమాలు, క్షీరాధివాసం, రుద్ర, చండీహోమం, గ్రామోత్సవం, మంగళ హారతి, తీర్థప్రసాదం, సాయంత్రం సాయంకాలగణపతిపూజ, వరుణ పూజ, మహాస్నపనం, ప్రదాన అధివాసహోమాలు, పుష్పాధివాసం, శయ్యాదివాసం, మంగళహారతి, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలుంటాయన్నారు. 14వ తేదీ ప్రాత:కాలగణపతిపూజ, వేదపారాయణం, గర్తపూజ, యంత్రప్రతిష్ట, రత్నాన్యాసం, విగ్రహప్రతిష్ట, కుంభాభిషేకం, బలిప్రదానం, పూర్ణాహుతి, సర్వదర్శనం, మంగళహారతి, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలుంటాయన్నారు. భక్తులు విరివిగా హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

## సంగం పీఏసీఎస్ చైర్మన్‌గా..

# గుండ్లపల్లి శ్రీనివాస్ యాదవ్



**పొదలకూరు/సంగం, మేజర్‌న్యూస్ :** సంగం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) చైర్మన్‌గా గుండ్లపల్లి శ్రీనివాస్‌యాదవ్ ఎంపికయ్యారు. సభ్యులుగా పెరమన గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు పిట్టు పట్టాభిరామి రెడ్డి, మర్రిపాడు గ్రామానికి చెందిన చేవూరు జనార్దన్ రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. తమకు పదవులు వచ్చేందుకు కృషి చేసిన రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కాగా మంత్రి ఆనం సహకారంతో సంగం సొసైటీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు.

### మహిళలను పరిశ్రమకవేత్తలుగా చేయాలన్నదే..

# ప్రభుత్వ లక్ష్యం : మంత్రి నారాయణ

- మెప్మా మహిళలతో క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించిన మంత్రి
- షాపులు పెట్టే మహిళలకు లక్ష రూపాయలు ఆర్థిక సహాయం ప్రకటించడం పట్ల మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన మహిళలు
- మైపాడు గేట్ సెంటర్ వద్ద స్మార్ట్ స్ట్రీట్ 240షాపులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- తొలి విడతలో 120 షాపులు ప్రారంభం





**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో ప్రతి ఇంటి నుంచి ఓ మహిళను పారిశ్రామికవేత్తగా చేయాలన్నది కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. ఆదివారం మంత్రి క్యాంపు కార్యాలయంలో మైపాడు గేట్ సెంటర్ వద్ద షాపులు పెట్టే మెప్మా మహిళలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం మహిళలకు అండగా ఉంటుందని, రాష్ట్రవ్యాప్తంగా స్మార్ట్ స్ట్రీట్ ఏర్పాట్లకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో మొదట్గా మైపాడు గేట్ సెంటర్ వద్ద 240 షాపులు ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. కంటైనర్లు యుద్ధప్రాతిపదికన సిద్ధమవుతున్నట్లు తెలియజేశారు. తొలి విడతలో 120 షాపులు ప్రారంభిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. మహిళలకు కార్పొరేషన్ మెప్మాల ద్వారా రెండు లక్షల రూపాయలు సబ్సిడీ అందుతుందని, బ్యాంకు ద్వారా రెండు లక్షలు లోన్ మంజూరు అయిందన్నారు. అయితే వీరికి మంత్రి నారాయణ సొంత నిధులతో ఆర్థిక సహాయం లక్ష రూపాయలు సాయం చేస్తానని తెలిపారు. మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం ఈ షాపులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. మహిళలు సద్వినియోగం చేసుకొని అందరికీ ఆదర్శంగా నిలవాలని ఆయన కోరారు. తమ వ్యాపార అభివృద్ధికి సొంత నిధులు ప్రకటించిన మంత్రికి ఈ సందర్భంగా మహిళలు కృతజ్ఞతలు తెలియజేశారు.

# సచివాలయ సిబ్బంది ప్రజలతో ఫ్రెండ్లీగా ఉండాలి : మంత్రి

- సంక్షేమ ఫలాలు పేదలందరికీ అందేలా చూడాలి
- సమయపాలనతో ప్రజలకు మెరుగైన సేవలు అందించండి



**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** సచివాలయ సిబ్బంది ప్రజలతో ఫ్రెండ్లీగా ఉండాలని.. సంక్షేమ ఫలాలు పేదలందరికీ అందేలా చూడాలని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఆదేశించారు. క్యాంపు కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో అయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. సచివాలయ సిబ్బంది సమయపాలనతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, నెల్లూరుని మోడల్ సిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వంలో బాగా పని చేసే వాళ్ళకి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అనంతరం సిబ్బందికి విధివిధానాలపై దిశా నిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలు తెలుసుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలన్నారు. ఓల్డేజ్ హోంలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సచివాలయ సిబ్బందికి మంత్రి సూచించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి తల్లికి వందనం అందేలా చూడాలన్నారు. 9వ డివిజన్లో 22 ఎకరాల్లో మోడల్ మార్కెట్ ని ఏర్పాటు చేస్తున్నామని, పినాకిని పార్క్‌లో వాటర్ స్పోర్ట్స్ రాబోతుందని తెలిపారు. ప్రధాన రహదారులను స్వీపింగ్ మిషన్లతో శుభ్రం చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టామన్నారు. పార్కులను ఆధునికనిస్తున్నామని, ప్రభుత్వ పాఠశాల రూపు రేఖలు మారుస్తున్నామన్నారు. అంత ర్జాతీయ ప్రమాణతో సిద్ధం చేస్తున్నామని తెలిపారు. భగత్ సింగ్ కాలనీ వాసులకు శాశ్వత ఇల్లు పట్టాలను కూడా అందజేశామన్నారు. దశాబ్దాల సమస్యను పరిష్కరించామని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఆర్థిక పరిస్థితి బాగో లేకపోయినా అభివృద్ధి సంక్షేమాన్ని ప్రజలకు అందించడంలో కూటమి ప్రభుత్వం ముందుంది అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని పథకాలను అనర్హులుగా ఉన్న వారి జాబితాను సిద్ధం చేయాలన్నారు. సచివాల సిబ్బంది ప్రజలతో ఫ్రెండ్లీగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమీషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, టీడీపీ సీనియర్ నేత వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, టీడీపీ ముఖ్య నేతలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలంలో టీడీపీ నేతల ప్రత్యేకపూజలు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** శ్రీశైలంలో ఆత్మకూరు తెలుగుదేశం నాయకులు ప్రత్యేకపూజల్లో పాల్గొన్నారు. రాఖీపండుగ సందర్భంగా శనివారం స్తానిక మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి, వ్యవసాయమార్కెట్‌కమిటీ వైస్‌చైర్మెన్ గొట్టిగుండాల బుజ్జిరెడ్డిలు పాల్గొని రాష్ట్రదేవాదాయశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో విలసిల్లాలంటూ దేవుని ప్రార్థించుకొని ఈ పూజలు నిర్వహించారు. బుజ్జిరెడ్డి తలనీలాలు కూడా సమర్పించి మ్రొక్కులు తీర్చుకున్నారు. మంత్రి ఆనం సారధ్యంలో ఆత్మకూరు నియోజకవర్గం అన్నిరంగాల్లో సర్వతోముఖాభివృద్ధి చెందాలని, ఆమేరకు మంత్రికి మరింతశక్తిప్రసాదించాలని వారు దేవుని ప్రార్థించుకున్నారు.

సూర్య
విలేకర్లు కావలెను
తెలుగు పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న నేటి దినపత్రిక సూర్య నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.
కావలసిన సెంటర్లు
నెల్లూరు జిల్లాలోని సంగం, కొడవలూరు, మనుబోలు, అల్లూరు, దగదర్తి, కొండాపురం, కలిగిరి, కలవాయి, విడవలూరు, ఇందుకూరుపేట, కోవూరు, నెల్లూరు పట్టణంలోని దర్గామిట్ట, స్టోన్ హౌస్‌పేట, బాలాజీ నగర్‌లలో విలేకర్లు కావలెను
మీ పూర్తి బయోడేటాతో వారంలోపు క్రింది చిరునామాలో సంప్రదించగలరు.
నేటి దినపత్రిక సూర్య కార్యాలయం
మిలటరీ కాలనీ, రోడ్ నెం.1,ఎల్ఐసి & సిఐడి ఆఫీసు ఎదురుగా, కొండాయపాలెం గేట్ సెంటర్, నెల్లూరు
9000118811, 9000483583

# ప్రజలకు నరకయాతనగా నల్లపురెడ్డిపల్లి రోడ్డు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలంలో నల్లపురెడ్డిపల్లి రోడ్డుగా పిలువబడే మూడు గ్రామాల రహదారి దశాబ్దకాలంగా ప్రజలకు నరకం చూపుతోంది. ఈరోడ్డు అడుగడుగునా పెద్ద గుంటలు పడి తీవ్ర అసౌకర్యంగా ఉంది. కనుపూరుపల్లి, మురుగుళ్ళ, నల్లపురెడ్డిపల్లి గ్రామాల ప్రజలు ఈరోడ్డు పై ప్రయాణం చేయడం అత్యంత ఇబ్బందికరంగా ఉంటోంది. ఈమూడు గ్రామాల వారు దశాబ్దకాలంగా తమ వేదనను వినిపిస్తూనే ఉన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులకు తమ అవస్థలు వివరిస్తూనే ఉన్నారు. కాగా రెండేళ్ళక్రితం ఈరోడ్డుకు మరమ్మత్తులు అంటూ జెసిబితో రోడ్డును పెకటించారు. దాంతో గుంటల కాస్తా తీవ్రమై మరింత ఇబ్బందికరంగా మారింది. ద్విచక్రవాహనకారులు మరింతగా ఇబ్బందిపడుతున్నారు. ఆమార్గంలో బస్ లేకపోగా ఆటోలు అధికంగా నడుస్తుంటాయి. ఆటోల డ్రైవర్లు, అందులో పయనించే ప్రయాణీకుల అవస్థలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. ఎన్నికల సమయంలో ఆగ్రామాలకు ఏ ప్రతినిధి వచ్చినా తమ రోడ్డు దుస్థితి, తమ అవస్థలు వివరిస్తూనే ఉన్నారు. ఆసమయంలో వారు హామీలివ్వడమే తప్ప రోడ్డుకు మరమ్మత్తులు మాత్రం చేయడంలేదు. దాంతో ఎంతకాలం తమ అవస్థలు అని వారు ప్రశ్నిస్తున్నారు. అభివృద్ధిప్రదాతగా నాడునేడు పేరుగాంచిన రాష్ట్ర దేవాదాయశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఈరోడ్డుపై కాస్తంత దృష్టిసారిస్తే తమ సమస్యలు వెంటనే తొలగిపోతాయని, ఆయన వెంటనే శ్రద్ధచూపాలని మురుగుళ్ళ, కనుపూరుపల్లి, నల్లపురెడ్డిపల్లి గ్రామాలవారు, ఆమార్గాన వెళ్ళే ఇతర ప్రాంతాలవారు కోరుతున్నారు.

# పొదలకూరు పీఏసీఎస్ చైర్మన్‌గా మస్తాన్ బాబు



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** పొదలకూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్‌గా తలచీరు మస్తాన్ బాబు ఎంపికయ్యారు. సభ్యులుగా మొగులూరుకి చెందిన సీనియర్ టీడీపీ నాయకులు కోడూరు పెంచల భాస్కర్‌రెడ్డి, దేగపూడికి చెందిన గంట మల్లికార్జున్‌యాదవ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా మస్తాన్‌బాబు మాట్లాడుతూ.. తమకు పదవులు వచ్చేందుకు కృషి చేసిన సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి సహకారంతో పొదలకూరు సొసైటీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు.